# సుందరబాబు

**★ బదరీనాథ్ ★**

ఆ వూరి హైస్కూల్‌లోకి క్రొత్తగా వచ్చిన హెడ్మాష్టరు సుందరబాబు పేరుకి తగ్గట్టు అంత అందగాడు కాకపోయినా అనాకారిమాత్రం కాదు. పదవికి హెడ్మాష్టరేకాని వయస్సులో అతిలేతగాడు. ముఖంచూట్టంతోటే యిరవై సంవత్సరాలకి పైనా ముప్ఫై యేళ్ళలోపూ వున్న మనిషని అతితేలికగా వూహించవచ్చు. ఎడం భుజంమీదున్న పుట్టుమచ్చ అతని ముఖానికదో వింతకళని కల్పించింది. అతని హృదయంచాలా విశాలమైనది. తన మృదువైన మాటల్తో ఎదుట మనిషిని చక్కగా ఆకర్షించేవాడు. అతన్తో మాట్లాడ్తూవుంటే ఇంకా మాట్లాడాలనిపించే దందరికి. మాటల్తోగాని చేతల్తోగాని మరోమనిషి మనస్సు నొప్పించటం అతనికి చేతగానిపని. కాని కొన్ని చిన్నచిన్న విషయాలే అతనూహించుకో లేకపోయేవాడు.

ఆహైస్కూల్లో పనిచేస్తున్న శారదకి హైస్కూలంటే మునుపులేని అభిమానమూ, ఆత్రమూ అపరిమితంగా కలిగాయి. ఈ వింత మార్పుకి తనే ఒక్కొక్కసారి ఆశ్చర్యపోతూ వుంటుంది.

బహుశా ఇందుకు కారణం సుందరబాబేమో! ఈ ఆలోచన తట్టినప్పుడు అప్రయత్నంగా శారద ఎందుకో అమితమైన సిగ్గుపడేది. ఎవ్వరూ లేకపోయినా అప్రయత్నంగా తలవంచుకొనేది. మళ్ళీ అనుకునేది. "ఛీ! ఎందుకు సిగ్గుపడతాను" అని తన్లో తనే నవ్వుకునేది. మునుపు జ్వరంవచ్చిందనో తల నొప్పనో ఎందుకో అస్తమానం సెలవు పెట్టాలనిపించేది. కాని యిప్పుడు నిజంగా యేమైనా వచ్చినా స్కూలుకి తప్పని సరిగా వెళ్ళేది శారద. ఆమె స్కూలుకి వెళ్తుంది. ముందు హెడ్మాష్టారిరూమ్‌లోకెళ్ళి పుస్తకంలో సంతకం పెట్టాలి. వెడుతుంది. సుందరబాబామె కేసి చూస్తాడు. ఆమెకూడా చూడాలనుకుంటుంది. చూస్తుందిగూడాను. ఎందుకో ఆమెకు నవ్వాలనిపిస్తుంది. ఒద్దనుకన్నా ఆ యెర్రటి పెదవుమీద చిరునవ్వు తాండవిస్తుంది. ఎందుకో ఆమెగుండె వేగంగా కొట్టుకుంటుంది. తడబడుతున్న కాళ్ళతో వచ్చెయ్యబోతుంది శారద. ఇంతలో వెనకనించి తియ్యటికంఠంవినిపిస్తుంది. "శారదా దేవిగారూ!" తనుహఠాత్తుగా తలొంచుకుని నిలబడేది. మళ్ళీ ఆ మధుర కంఠం అనేది—"సంతకం చెయ్యకుండా వెళ్తున్నారే?" "ఓ....మర్చిపోయాను క్షమించండి." శారద తడుంకుంటూ సమాధానం చెప్తుంది. సుందరబాబెందుకో నవ్వుకుంటాడు.

కాలం గడిచింది. సుందరబాబుకి శారదకీ పరిచయం జాస్తీయింది. ఇప్పుడామె అతన్నడిగింది. "ఏమండీ! మీమనస్సేపరిచయం చేసుకోవాలనుంది" అని. కాని యిది శారద గుండెల్లోంచి వచ్చిన ప్రశ్నకాదు. సుందరబాబు గట్టిగా నవ్వాడు. "నాకింకా పెళ్ళికాలేదండీ" శారద యీవిషయంలో గట్టిదే. అన [illegible] విషయం ఓ ప్లీడర్‌లా రాబట్టుతుంది. శారదఅంది. "దయచేసి మీరు నన్ను 'అండీ' అనొద్దు" అని.

"ఏం? మరి మీరు నన్ననచ్చా" అన్నాడతడు కొంటెగా. "మీరు నాకంటె వయస్సులోనే అది కారంలోనూ గూడా పెద్దవాళ్లే. అంచేత నేననడా నికి అధికారముంది" అంది శారద. సుందరబాబు అందుకు వప్పుకోక తప్పిందికాదు.

శారద యెప్పుడూకూడా బొట్టుపెట్టుకుని వుం డగా సుందరబాబెప్పుడూ చూడలేదు. ఆమెకూడా చాలా నిరాడంబరంగా వుండేది. బహుశా ఆమె బొట్టుపెట్టుకోక పోవటం నాగరికతగా భావిస్తుం దేమో అనుకునేవాడు సుందరబాబు. అందుకనే చెప్పా - ఒక్కొక్క చిన్నవిషయాన్నే సుందర బాబూహించుకో లేదవి. ఒకోసారి శారద తన్తో మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖంమీద విషాద చ్ఛాయలు గుమ్మరించేది. బహుశా తనమాటల్లోవి కాఠిన్యతవల్లనేమో అం సుందర బాబు మథన పడి ఆమెని క్షమాపణ కోరేవాడు.

కొన్నాళ్లు గడిచాయ్ అందరినోటంటా అదే మాట. సుందరబాబుకీ - శారదమ్మకీ పదిహేనో తారీఖుని పెళ్లి - తెలుసా — ఇందుకు చాలామంది సంతోషించారు. కొంతమంది ముక్కుమీద వేలేసుకున్నవాళ్లుగూడా లేకపోలేదు. అందులో నారాయణరావుది అగ్రతాంబూలం. ఆరోజు పద మూడో తారీఖు. శారద స్కూలుకి రావటంలేదు. సుందరబాబు రాక తప్పదుగా. స్కూల్లో పాఠాల కన్నా హెడ్మాష్టారి పెళ్లిసంగతులే ఎక్కువగా జరుగుతున్నాయ్. ఆరోజున సుందర బాబుకి చాలామంది స్నేహితుల్దగ్గిర్నుంచి ఉత్తరాలు వచ్చాయ్ అభివందనాల్తో అయితే లక్ష్మణరావ్ హెడ్మాష్టర్ అనే ముద్రతో ఒకవరొచ్చింది. ఆ హైస్కూల్ హెడ్మాష్టర్ లక్ష్మణరావు కాక పోయినా ఆ కవర్ని సుందరబాబే తీసుకున్నాడు. ఓమాదిరి భయంతోనూ. విసుగుతోనే ఆకవరు చించాడు. ఎందుకో అతనివదనబింబాన్ని విషాద మేఘచ్ఛాయ లావరించాయ్. అయితే యీసంగతి పక్కనున్న లక్ష్మయ్యే కనిపెట్టలేక పోయేడు.

లక్ష్మయ్య హైస్కూలు ప్యూన్. హెడ్మాష్టర్ యింట్లోనే వుంటూ వుంటాడు. ఆ వుత్తరం చూశాక సుందరబాబు మరిస్కూల్లో వుండలేదు. వుండలేక పోయేడు. వెనకాలే లక్ష్మయ్యగూడా బయల్దేరాడు. సుందరబాబు యింటికివచ్చిన కొద్ది నిమిషాల్లో నారాయణవచ్చి "సుందరబాబున్నాడా" అని లక్ష్మయ్య నడిగాడు. "ఆఁ లోపల టీత్రాగు తున్నారు" అన్నాడు లక్ష్మయ్య. "నారాయణ తనెరుగని మ షి కాదుగని అతని వివరాలేవీ లక్ష్మయ్యకి తెలియవు. నారాయణ ముఖంలో వున్న ఆనాటి తీవ్రతని లక్ష్మయ్య అదే మొదటి సారి చూడ్డం. మరో అరగంట గడిచాక చాలా కోపంగా యివతలికి వచ్చేశాడు నారాయణ. అతను వచ్చేటప్పుడన్న "ప్రాణాలదక్కవ్! జాగ్రత్త" అన్న మాట లక్ష్మయ్యని చాలాకల వర పెట్టింది. మరికొన్ని క్షణాల తర్వాత సుంద రబాబు ఓవర్కోటు వేసుకుని చిన్న సంచీ చేత్తో పట్టుకుని బయట కెళ్లాడు. తిరిగి ఓ అరగంట తర్వాత అతి చికాకుతో యింటికి వచ్చేశాడు కాని దుస్తులు మారిపోయాయ్ చాలాడస్సిపోయి నట్టు కనిపించాడు. ముఖంలో నైరాస్యం నీరసం గోచరించాయ్ లక్ష్మయ్య సహజవాత్సల్యంతో అడిగాడు. "ఏంబాబూ అల్లావున్నారు" అని. కాని లక్ష్మయ్య ఎన్నడూ అనుకోని, వూహించని తిరస్కృతీ, క్రోధమూ మిళితమైన ఒక్కచూపుని మాత్రం సమాధానంగా పొందగలిగాడు. సుందర బాబు లోపలికిపోయి ఠక్కున తలుపు వేసుకున్నాడు. లక్ష్మయ్య చాలా బాధపడ్డా "ఎందుకో బాబివ్వాళ చికాగ్గా వున్నాడ" ని సరిపుచ్చుకో గలిగాడు. ఆ రాత్రి పది గంటలయిం. గదిలోంచి పెద్దకేక వినిపించింది లక్ష్మయ్య తలుపు సందులోంచి చూశాడు. బాబు నేలమీద అమానుషంగా విల పోతున్నాడు. బాబు ఆవలించినప్పుడు పెద్ద అరచి నట్టుగా వుండేది. లక్ష్మయ్య ఆకేక బాబు ఆవ లింతేమో అనుకున్నాడు. అంచేత లక్ష్మయ్య తిరిగి పడుకున్నాడు. ఇదైనకొంతసేపటికి పోర్టి

కోలో వున్న మొక్కల్లో శబ్దం అయింది. పాడు పందికొక్కులు మొక్కల్ని తవ్వితగలేస్తున్నా యనుకున్నాడు లక్ష్మయ్య.

తెల్లవారింది రోజూ ఐదున్నరకే లేచే సుందరబాబు యివ్వాళ తొమ్మిదయినా లేవలేదు. ఇవ్వాళ బోలెడన్ని పెండ్లి ప్రయత్నాలు చెయ్యాలి. టైంలేదు. ఎల్లాగ? లక్ష్మయ్య బాబుని లేపుదామనుకున్నాడు తలుపులు బలంగా తట్టాడు. తలుపులు తియ్యబడలేదు అంతే కాకుండా లోపల నుంచి ఏవిధమైన సమాధానమూలేదు "ఇదేమిటి చెప్మా. బాబెప్పుడూ యింత మొద్దునిద్దర పోలేదే" అనుమానం కలిగింది లక్ష్మయ్యకి. చుట్టు ప్రక్కలున్న నలుగురి సహాయంతో తలుపులు పుతకలెత్తేశారు. లోపలికి ప్రవేశిస్తూనే లక్ష్మయ్య 'షాక్' కొట్టినవాడిలా అదిరిపడ్డాడు అభయంకర దృశ్యం తానెన్నడూ చూస్తానని లక్ష్మయ్య కల్లోగూడా అనుకోలేదు. మరుక్షణంలో శారద రెక్కలు కట్టుకు వాలిందక్కడికి సుందరబాబు శీతలదేహం చూసేసరికి అందరికళ్లూ నీళ్లతోనూ హృదయాలు విచారంతోనూ, నిండిపోయినయ్. సుందరబాబు చల్లటి విశాలమైన వక్షస్థలంమీద తలాన్చి శారద యేకధారగా యేడ్చింది. పీటమీద పెళ్లినీవిధంగా పడదోశాడని విధిని అందరూ కసిదీరా తిట్టేరు. ఏంతిడితే ఏంలాభం లోతుకు పోయినకళ్లూ, దొక్కుపోయిన బుగ్గలూ చూసి శారద హృదయ వారధి బద్దలై పోయి శోక సముద్రం వెల్లువలై పారింది.

ఇంతలో సబిన్స్పెక్టరూ, సర్కిలూ, డిటక్టివ్ మాధవరావ్ కొంతమంది పోలీసుల్తో అక్కడికి హాజరయ్యారు గదిఅంతా పరిశోధించారు. ఎక్కడి వక్కడ చెక్కుచెదరకుండా వున్నాయి. ఎందుకోసం? ఎవరివల్ల? జరిగిందీహత్య. కొమ్ములుతిరిగిన డిటెక్టివ్ మాధవరావంటేనూ. అతనే కొంతసేపు బుట్ట పాడుచేసుకున్నాడు, శవాన్ని సరిగాపరీక్షించాక నుదుటిమీద బలమైన గాయం తగిలిందని కనిపెట్టేరు. ఆ భాగమంతా కమిలిపోయిందిగాని ఒక్కరక్తపు చుక్కయినా రాలేదు. తర్వాత లక్ష్మయ్యకి జ్ఞాపకం వచ్చింది. నారాయణరావడం "ప్రాణాలుదక్కవ్ జాగ్రత్త" అని హెచ్చరించడమూనూ, వెంటనే డిటెక్టివ్‌కి తెలియ జేశాడు అంతు చిక్కిందనుకున్నారంతాను. వార్తాపత్రికల్లో సుందరబాబు హత్యని గూర్చి పెద్దపెద్ద అక్షరాల్తో పడింది.

ఆరోజున కోర్టంతా జనంతో కిటకిటలాడిపోతోంది. అందరి హృదయాలూ తటతటా స్పందిస్తున్నయ్ హంతకుణ్ణిచూసి పళ్లు కొరకడానికి అంతా సిద్ధంగా వున్నారు జడ్జీ వచ్చారు. ఎప్పుడూ శంకించ టానికి వీల్లేని ముగ్గురు ముద్దాయిలు బోనుదగ్గర నుంచున్నారు. అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. అందరిలోకీ ఆశ్చర్యం లేకుండా తాపీగా ఓ గడ్డం మనిషిమాత్రం కూర్చున్నాడు. విచారణ ప్రారంభ మయింది. శారద ముందు బోనులో నిలబెట్టబడింది. ఆమె మాట్లాడ్డం ప్రారంభించింది.

"నాకు జీవితమంటే యేమిటో యెరగని పసితనంలోనే వివాహమయింది. జీవితంలో ప్రవేశించి ప్రపంచజ్ఞానం తెలుసుకున్నాక నాభర్తని చూసే అవకాశం భగవంతుడు నాకు గల్పించలేదు. సంఘం నా అరుణతిలకాన్ని తనకటుకు హస్తాల్తో తుడిచివేసింది. నా దురదృష్టానికి విచారించినది నా తల్లి ఒక్కతె మాత్రమే. నాన్నగారు యీనాదౌర్భాగ్యం చూడకుండానే మమ్మల్ని యేకాకులుగా చేసిపోయేరు. మా అత్తింటి వారెవరూ నన్నుగూర్చి విచారించటంగాని, సానుభూతి చూపటంగాని యేమీ చెయ్యలేదు. వారబ్బాయ చనిపోయినందుకు నేనేకారణమని నామీద దుమ్మెత్తిపోశారు, తర్వాత వాళ్లు నామొహాన్ని చూశిన పాపానపోలేదు. కావలిస్తే ముద్దాయిల్లో ఒకడైనపూర్వం నామరిదిగారైన నారాయణ్ణే అడగొచ్చే" అని శారదఅంటుంటే నారాయణమొహం

కందగడ్డలా జేవురించింది. కాని ఆదిన్యాయస్థానం అయిపోయింది. తిరిగి శారద ప్రారంభించింది. "తర్వాత మా అమ్మే తనరెక్కల కష్టంమీద నాకు చదువు చెప్పించింది నాసంపాదన అనుభవించక ముందే నన్నొంటరిదానిగా చేసి మా అమ్మ యీ లోకాన్ని వదలివెట్టింది నాకు యీవూరి హైస్కూల్లో టీచర్ వుద్యోగం దొరికింది. తర్వాత ఆరుమాసాల క్రిందట సుందరబాబు హైస్కూలులో ప్రధానోపాధ్యాయుడిగా రావటం త్వరిత కాలంలో మాహృదయాలు ఒక్కటి కావటమూ జరిగింది తిరిగి వివాహం చేసుకునే అధికారాన్ని నాకు సంఘం యివ్వకపోయినా, నా ప్రణయ పూరిత హృదయంఇచ్చిన అధికారంతో సంఘాన్ని యెదిరించి ఆయన్ను వివాహం చేసుకోదల్చుకున్నాను. అయితే ఇందులో ఆయన్ని మోసంచేదామనికాదుగాని, ఆవిశాల హృదయం నాదికాకపోతుందేమో అన్నవుద్దేశ్యంతో ఆయనకీ సంగతి చెప్పలేదు మా వివాహానికి ముహూర్తం గూడా నిర్ణయించారు. కాని నేను ఆజన్మాంతం తిలకవిహీనగా వుండాలనే విధి నిర్ణయిస్తే మరోలా జరగడానికి యెలా అవకాశం వుంది. ఇంతే - ఇంతకంటే నేను చెప్పదగిందీ - చెప్పగలిగిందీ కూడాయేమీలేదు." అని శారద గంభీరంగా చెప్పిముగించింది. అందరికళ్ళూ చెమ్మగిల్లాయ్. నారాయణగూడా ఉవికినదుఃఖాన్ని లోలోపలే దిగమింగాడు తర్వాత నారాయణ బోనులో నుంచున్నాడు. "శారద - అంటే మావదినగారు చెప్పినదంతానిజం. నేను ఆ పూర్వపు కక్షలవల్లనే ఆమె యిప్పుడు వివాహం చేసుకుంటూందంటే మండిపడ్డాను ఆకోపంమీదే సుందరబాబింటికెళ్ళి నా నా మాటలూ అన్నమాటనిజం కాని అతని ఖూనీ విషయంలో మాత్రం నిజంగా నాకేమి తెలియదు. ఇది ముమ్మాటికీ నిజం. ఇంతకంటే నాకేమీ తెలియదు" అని నారాయణగూడా తన విన్నపం ముగించాడు. తర్వాత లక్ష్మయ్య బోనులోనుంచుని చెప్పినదిది "నేను పదిసంవత్సరాలుగా యీ స్కూల్లో బంట్రోతుగా పని చేస్తున్నాను. సుందరబాబు వచ్చిన తర్వాత, ఆయన బ్రహ్మచారి కావడంచేత తననికనిపెట్టుకునివుండమని ఆ బాబు చెప్పడంచేతా, నాకూ యెవరూ లేకపోవడంవల్ల ఆయనదగ్గిరే వుంటావచ్చాను బాబు లోపల గదిలోపడుకునేవారు. నేనుమాత్రం యివతల వరండాలో పండుకునేవాణ్ణి. బాబు నన్ను చాలా ప్రేమతోనూ వాత్సల్యంతోనూ చూసేవారు. ఒకరోజున— అంటే ఎల్లుండి బాబు వివాహ మనగా నారాయణ నాదగ్గిరకొచ్చి "బాబున్నాడా?" అనడిగాడు లోపల టీతాగుతున్నారని చెప్పాను. విసురుగా, కోపంతో లోపలికి వెళ్లాడు. అరగంట గడిచింది. తర్వాత నారాయణ యివతలికి వస్తూ 'ప్రాణాలు దక్కవ్, జాగ్రత్త అన్న మాటలు మాత్రం వినిపించాయ్. ఈ మాటయి వినగానే నావళ్ళు 'ఝల్లు' మంది. తర్వాత నారాయణ వెళ్ళిపోయాక బాబు చిన్న 'హాండ్ బేగ్' తీసుకుని యెక్కడికో వెళ్ళిపోయేరు. వెళ్ళేటప్పుడు నాతోఏమీ చెప్పలేదు. అప్పటికి మామూలుగానే యున్నారు. తర్వాత ఆరగటకి మళ్ళీ వచ్చారు. కాని బట్టలుమాత్రం పూర్తిగా మారిపోయేయ్. ఒకవేళ శారదమ్మగారింటికి వెళ్ళేదేమో అనుకున్నా. ఆ సమయంలో బాబుచాలా చికాకుగానూ నీరసంగానూ కనిపించారు. ఆప్యాయంగా పలకరించేను. కాని నేను ఎన్నడూ ఊహించని సమాధానం మాత్రం పొందగలిగేను. బాబులోపలికెళ్ళి తలుపేసుకున్నారు. నేను మామూలుగా వరండాలోనే పడుకున్నాను. కొంతసేపటికి గదిలోంచి పెద్దకేక వినిపించింది. బాబు ఆవలించారనుకున్నాను. కొంతసేపటికి పోర్టికో మొక్కల్లోయేదోకదలిన శబ్దం అయింది. పందికొక్కులేమో అనుకున్నాను. తెల్లారంగానే లేచేబాబు ఆరోజున తొమ్మిదిన్నరయినా లేవలేదు. తలుపులు గట్టిగా తట్టాను కాని లాభం లేకపోయింది. తర్వాత తలుపులు బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించాం. ఆపైన అందరికీ తెలిసిందే" అనిముగించాడు లక్ష్మయ్య. తర్వాత న్యాయాధిపతి యిలా అన్నాడు, "ఇప్పటికి జరిగిందంతా విన్న మీదట నారాయణే హంతకుడుగా కోర్టువారు తీర్మానించారు. కాబట్టి అతడు...." అని యింకాఏమో చెబుతూండగానే 'ఆగండి' అన్న పెద్దకేక ప్రేక్షకుల్లో ఒకర్నించి వినిపించింది. దాంతో అందరూ నివ్వెరపోయారు. అందరూ

అచేపే చూశారు. ఇంతలో ఆ గడ్డం మనిషి ప్రేక్షకుల్లోంచిదిగి తానేబోనులో నుంచుని యిలా అన్నాడు. "చట్టవిరుద్ధంగా ప్రవర్తించినందుకు నన్ను కోర్టువారు మన్నించాలని ప్రార్థిస్తున్నాను. అంతేకాదు హంతకుడూ, హత్య చేయబడ్డవాడూ కూడా ఒకచేననీ నేనే సుందరబాబుననీ తెలుసు కొమ్మనికూడా కోరుతున్నాను." అన్నాడు గడ్డం పీకితారేస్తూ. ఈ దెబ్బతో అందరి గుండెలూ ఒక్కసారి ఆగిపోయేయి అందరూ భయకంపితులయ్యారు. న్యాయాధిపతి నిస్తేజు డయ్యాడు. అందరూ ఆశ్చర్యంతో ఊగిపోతున్నారు.

ఏమిటి? ఈకోర్టులో.... యీబోనులో.... నిలబడ్డది సుందరబాబా? లేక అతను భూతమై యిల్లా వచ్చాడా? లేకపోతే యీ విడ్డూరం యేమిటి? నెలరోజుల క్రిందట అందరి బ్రతికున్నవాళ్ళకళ్ళయెదుటా చచ్చిపోయిన సుందరబాబుదేహం లోతుగా—జాగ్రత్తగా భూస్థాపితం చేయబడి దానిమీద కొండరాళ్ళతో నిర్మించిన సమాధికూడా కట్టబడిందే? మరిదంతా యేమిటి? ఎవరికళ్లు వాళ్లే నమ్మలేక పోతున్నారు. కొన్ని నిమిషాలపాటు న్యాయస్థానంలో నిశబ్దమేకచ్ఛత్రాధిపత్యం వహించింది. సుందరబాబు దేహం మళ్ళీ అంది. "మీరంతా ఆశ్చర్యపోతున్నారని నాకుతెలుసు. కాని అనవసరంగా మీరు పిచ్చి భ్రమ పడుతున్నారు. నాగదిలో చచ్చిపడివున్న నా అన్నయ్య రామారావు శవాన్ని మీరుచూసి నాదే ఆశవమని భ్రమపడి నాకూ అతడికీగల మనస్పర్థలవల్ల అతనేనన్ను చంపివుంటాడని ఊహించి అతనికి ఉరిశిక్ష వేస్తున్నారు. అసలు సంగతి వినండి—

"చనిపోయిన అతనూ నేనూ యేకోదరులమూ కవల పిల్లలమూనూ, అతనిపేరు రామారావు. నాపేరు లక్ష్మణరావు. మేమిద్దరమూ ఒకలాగే వుండటం వల్ల మీరేకాదు అందరూ ఇలాగే పొరబాటు పడేవారు. అయితే మాయిద్దరికీ గుణాల్లోనే తేడా. వాడుత్త్తదుర్మార్గుడు, నిరుద్యోగి, త్రాగుబోతు జూదరి, తను ఖర్చుకోసం నన్నుపిండేవాడు. అతని అప్పుల వాళ్ళందరూ నన్ను పీడించేవారు. అతని శత్రువు లందరూ నన్ను హతమార్చటానికి ప్రయత్నించేవారు. అది మా యేకరూపం వల్లనే. కనుక మేమిద్దరమూ ఒకచోటే వుంటే నాగౌరవంకూడా పోతుందనేవుద్దేశ్యంతో సుందరబాబనే మారుపేరుతో యీవూరువచ్చి నాయోగ్యత వల్ల ఉద్యోగం సంపాదించుకున్నాను. నేనిక్కడ వున్నానని వాడికి తెలియదుగదా అనుకున్నాను. కాని యెట్లాగో తెలుసుకున్నాడు. నా వివాహం ఎల్లుండనగా లక్ష్మణరావు పేరుతో నాకొకకవరు రాసేడు తాను ఆరోజున వస్తున్నాననిన్నీ, ఓ ఐదు వేలు కావాలనిన్నీ వ్రాశాడు. అతనొస్తే అంతా అభాసయి పోతుందని ఎవ్వరితోటీ చెప్పకుండా నేను వెళ్ళిపోయి వెనకనించి పోర్టికోలోకి దిగి మొక్కల చాటున కూర్చున్నాను. నేను నిజంగా వెళ్ళిపోయాననే అనుకున్నాడు లక్ష్మయ్య. పోర్టికోకి ఎదురుగావున్న కిటికీలోంచి మాఅన్న చేస్తున్నదంతా గమనిస్తున్నాను. నేను మర్చిపోయా-మా అన్న ప్రవేశించడం చూసి నేనే వచ్చానను కున్నాడు లక్ష్మయ్య. మా అన్న అధికంగా త్రాగడంవల్ల అతనికి హృద్రోగం ప్రవేశించింది. అతనికి సంతోషంగాని కోపంగాని విచారంగాని అధికంగావస్తే గుండె ఆగిపోతుంది. నేనక్కడ లేకుండా వెళ్ళిపోయానని అధిక క్రోధంతో తన చావు తనే తెచ్చుకున్నాడు. పోయినవాడు తిరిగి యెలానూ రాడుగదా అనిన్నీ నేనక్కడుంటే కొంత రభస జరుగవచ్చుననే వుద్దేశ్యంతోటిన్నీ నేనక్కణ్ణించి ఒకచోటికి వెళ్ళిపోయేను. తర్వాత పత్రికల్లోని ప్రకటనచూశి యీనాడిక్కడికి అసలు సంగతి చెప్పేందుకు రాగలిగాను. ఇంతకీ వాడిని హత్యచేసింది ఎవరూకాదు. వాణ్ణి వాడి త్రాగుడే హత్యచేసింది, ఆత్రాగుడువల్లనే హృద్రోగం తెచ్చుకున్నాడు. అంతేతప్ప అతని చావుకి మరెవ్వరూ బాధ్యులుకారు" అని సహజమైన భాతృప్రేమవల్ల కొన్ని భాష్పకణాలు విడిచి అతని ఆత్మశాంతికి భగవంతుణ్ణి ప్రార్థించారు. అందరి ముఖాలూ సంభ్రమానందాలతో విప్పారేయ్. శారద ఆనందానికి అంతులేదు. నారాయణకళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి: లక్ష్మయ్య సంతోషానికి మేరలేదు. నారాయణ ఆధ్వర్యంలో లక్ష్మణరావు శారదల వివాహం జరగగా జడ్జీగారే స్వయంగావచ్చి వధూవరుల్ని ఆశీర్వదించారు.

(అంగకథ ఆధారంగా)